క్లుప్తంగా

చేతిరాతతో తలరాత మార్చుకో

బాలెమర్రు(క్రోసూరు): విద్యార్థుల చేతిరాత బాగుంటే వారు ఉన్నతస్థానాలకు ఎదుగుతారని ఎంఈవో జి.కృష్ణ అన్నారు. మండలంలోని బాలెమర్రులో ఎంపీపీఎస్ (ఎస్‌డబ్ల్యూటీ) పాఠశాలలో శనివారం కాలీగ్రాఫీ నిపుణుడు సందేశ్ విద్యార్థులకు చేతిరాత నైపుణ్యంపై అవగాహన కల్పించారు. పాఠశాల హెచ్ఎం శరత్‌కుమార్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఎంఈవో -2 గణేష్ మాట్లాడుతూ విద్యార్థులు మంచి చేతిరాతతో భవిష్యత్తులో ఎన్నో అవకాశాలు పొందగలుగుతారన్నారు. చక్కని చేతిరాతను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలన్నారు.కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా వైద్య ధన్వంతరీ స్వామికి పూజలు



అమరావతి: అమరావతిలో ధన్వంతరీ జయంతి సందర్భంగా శనివారం స్థానిక అమరేశ్వర ఘాట్‌లో నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో వైద్య ధన్వంతరీ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సేవా సంఘ ప్రతినిధి ఉంగుటూరు నిబద్ధి మాట్లాడుతూ సర్వరోగాలను నయం చేసే ధన్వంతరీ ఆశీస్సులు ప్రజలకు అందాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, శివప్రసాద్, రామాంజనేయులు, హనుమంతరావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

పీసపాడు(క్రోసూరు): మండలంలోని పీసపాడు గ్రామానికి చెందిన ముగ్గురికి ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ గుంటూరులోని తన కార్యాలయంలో సీఎం రిలీఫ్ చెక్కులను అందజేశారు. పీసపాడుకు చెందిన కంచేటి ఆంజనేయులు రూ.47,844, కంచేటిసాయిబాబు రూ.43,727, షేక్ సైదా సాహెబ్ రూ.30,786 విలువైన చెక్కులు ఇచ్చారు.

పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

బెల్లంకొండ: పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కె.కవిత తెలిపారు. శనివారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ లక్ష్మీ సులోచన విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి, మొక్కలు నాటించారు. అనంతరం విద్యార్థినీ, విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు రమేష్ బాబు, ఎ.కుసుమ కుమారి, సత్యప్రభ, బాలునాయక్ తదితరులు పాల్గొన్నారు.

నాగోతు చిన్నమ్మకు నివాళి



నకరికల్లు: మండలంలోని తురకపాలెంలో నాగోతు చిన్నమ్మ దశదిన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. మాజీ ఎంపీపీ నాగోతు శౌరయ్యకు మాతృవియోగంపై పలువురు నాయకులు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సత్తెనపల్లి, నరసరావుపేట, చిలకలూరిపేట ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీనారాయణ, డాక్టర్ చదలవాడ అరవిందబాబు, ప్రత్తిపాటి పుల్లారావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, నియోజకవర్గంలోని వివిధ హోదాల్లోని టీడీపీ నాయకులు హాజరై చిన్నమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

'సేకరించిన చెత్త మా గ్రామానికి తరలించొద్దు'

గురజాల: నగర పంచాయతీ పరిధిలోని వార్డుల్లో సేకరించిన చెత్తను తమ గ్రామానికి తరలించవద్దని జంగమహేశ్వరపురం గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గురజాల నుంచి వీధుల్లో సేకరించిన చెత్తను అక్కడే డంపింగ్ యార్డులో వేయకుండా జంగమహేశ్వరపురానికి తీసుకువచ్చి డంపింగ్ యార్డులో వేస్తున్నారన్నారు. చెత్తకు నిప్పు పెట్టడంతో తీవ్ర ఇబ్బందులకు గురిఅవుతున్నామన్నారు. గురజాల నుంచి తరలించే చెత్తను మా గ్రామంలో వేయవద్దన్నారు. అనంతరం కమిషనర్‌కు వినతిపత్రం అందించారు.

సమస్యను పరిష్కరిస్తాం ..

దీనిపై నగర పంచాయతీ కమిషనర్ వైవీఎల్ఎన్ శివన్నారాయణ మాట్లాడుతూ సమస్యను త్వరలో పరిష్కరించే విధంగా చర్యలు చేపడుతామన్నారు. సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే విధంగా చూస్తామని హామీ ఇచ్చారు.

'కోటి సంతకాలను' జయప్రదం చేయండి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, తదితరులు

కార్యకర్తల సమావేశంలో పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

పెదకూరపాడు: ప్రభుత్వం మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న కోటి సంతకాల ప్రజా ఉద్యమాన్ని కార్యకర్తలు, నాయకులు జయప్రదం చేయాలని పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పిలుపునిచ్చారు. శనివారం పెదకూరపాడులో జరిగిన నియోజకవర్గం స్థాయి రచ్చబండ, కోటి సంతకాల సేకరణలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ హయాంలో నిర్మాణం చేపట్టిన ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ప్రైవేట్‌పరం చేయడం దారుణమన్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వ్యతిరేకిస్తూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో అక్టోబర్ 10 నుంచి నవంబర్ 22 వరకు జరగనున్న రచ్చబండ, కోటిసంతకాల సేకరణ ప్రజా ఉద్యమాన్ని నాయకులు కార్యకర్తలు అందరూ కలిసి లక్ష్యం పూర్తిచేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకుడు ఎనుముల మురళీధర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు బెల్లంకొండ మీరయ్య, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు

ప్రజావ్యతిరేక పాలనను అంతమొందిద్దాం!

రాష్ట్రంలో ప్రజావ్యతిరేక పాలన కొనసాగుతోందని, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు పోరాటాలకు సిద్ధపడాలని జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి అన్నారు. చెరుకుంపాలెంలో శనివారం సాయంత్రం వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన కోటి సంతకాల సేకరణ పోస్టర్ ఆవిష్కరించారు. ఇంటింటికీ తిరిగి సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతిభ ఉంటే చాలు ఎవరైనా మెడికల్ విద్యను చదివే అవకాశాలు కల్పించిన మాజీ సీఎం జగన్ మోహనరెడ్డి ఆశయాలను కూటమి సర్కార్ నీరుగారుస్తోందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య, వ్యవసాయ కమిటీ మాజీ డైరెక్టర్ నెల్లూరి చంద్రబాబు, మాజీ సర్పంచ్‌లు చింతగుంట్ల హనుమంతరెడ్డి, వెన్నా శ్రీనివాసరెడ్డి, ఇమ్మానియేలు, భాస్కరరెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యను దూరం చేయొద్దు

అచ్చంపేట: ప్రతిభతో నిరుపేదలు సైతం వైద్యవిద్యను అభ్యసించేందుకు మాజీ సీఎం వైఎస్ జగన్ మోహనరెడ్డి రాష్ట్రంలో 17 వైద్యకళాశాలలను చేపడితే, చంద్రబాబు వాటిని ప్రైవేటీకరణ చేయాలనుకోవడం అన్యాయమని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య అన్నారు. వైద్య కళాశాలలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మాజీ సీఎం జగన్‌మోహనరెడ్డి పిలుపు మేరకు మండలంలోని మాదిపాడులో శుక్రవారం రాత్రి చేపట్టిన కోటి సంతకాల సేకరణలో ఆయన మాట్లాడారు. పోస్టర్స్ ఆవిష్కరించారు. ఇంటింటికీ తిరిగి సంతకాలు సేకరించారు. మాదిపాడు గ్రామం మొత్తం ప్రైవేటీకరణను ముక్తకంఠంతో వ్యతిరేకించింది. ఇకపై వైద్య విద్య కార్పొరేట్ సంస్థల కబంధ హస్తాల్లో చిక్కుకుంటుందని, సామాన్యుడికి మెడిసిన్ పరిస్థితులు ఉండవని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ యూనివర్సిటీ మాజీ డైరెక్టర్ నెల్లూరి చంద్రబాబు, సర్పంచ్ మాదా వెంకట్రావు, అచ్చంపేట మాజీ సర్పంచ్ కంబాల వీరబాబు, మైనార్టీ నేతలు కరీముల్లా, వాణిజ్యవిభాగం కార్యదర్శి దేవరశెట్టి శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ తిమోతి, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి చిట్యాల దావీదు, మండల కమిటి సభ్యుడు మునగాల శేషగిరిరావు, గ్రామపార్టీ కన్వీనర్ కొరివి నాగరాజు, సత్తెమ్మతల్లి ఆలయకమిటి ఛైర్మన్ కొరివి వెంకట నరేష్, గుడారి గోపి, యాం పొంగు దాసు, కొరివి రామారావు, షేక్ లాలు, పార్టీ అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కోటి సంతకాల ప్రజా ఉద్యమ పుస్తకాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం



చెరుకుంపాలెంలో కోటి సంతకాల సేకరణలో నేతలు



మాదిపాడులో పోస్టర్స్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

బినామీల కోసమే వైద్య విద్య ప్రైవేటీకరణ



దమ్మాలపాడులో జరిగిన కోటిసంతకాల సేకరణలో డాక్టర్ గజ్జలసుధీర్‌భార్గవరెడ్డి

దమ్మాలపాడు(ముప్పాళ్ళ): పేద విద్యార్థులకు వైద్య విద్య అందకుండా కేవలం తన బినామీలకు కళాశాలలను కట్టబెట్టేందుకే సీఎం చంద్రబాబు ప్రైవేటీకరణ కుట్రలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవరెడ్డి అన్నారు. దమ్మాలపాడులో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యాన మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కోటిసంతకాల సేకరణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. సుధీర్‌భార్గవరెడ్డి మాట్లాడుతూ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 17 ప్రభుత్వ వైద్య కళాశాలలను తీసుకొస్తే కూటమి ప్రభుత్వం వాటిని నిర్వహించలేమని, పీపీపీ ముసుగులో బినామీలకు కట్టబెట్టేందుకు ప్రయత్నించడం సిగ్గుచేటన్నారు. కల్తీ మద్యం కేసులో టీడీపీ నాయకులే పట్టుబడితే వైఎస్సార్ సీపీపై నెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కూటమి పాలనపై ప్రజల్లో ఆగ్రహం మొదలైందని, వైద్య కళాశాలల ప్రైవేటీకరణను నిలిపివేసే వరకు ఉద్యమం కొనసాగుతుందన్నారు. వైఎస్సార్ సీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణకు మంచి స్పందన లభిస్తోందన్నారు. జిల్లా బూత్ కమిటీ అధ్యక్షుడు ఇందూరి నరసింహారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు ఎంజేఎంరామలింగారెడ్డి, రెండెద్దుల వెంకటేశ్వరరెడ్డి, కళ్లం శివరామిరెడ్డి, బద్దిగం జగన్నాథరెడ్డి, కళ్లం కోటిరెడ్డి, గంజి శ్రీనివాసరావు, చావా రమేష్, చింతపల్లి బాబు, లక్కిరెడ్డి జానకీరాణి, చయికం వెంకటప్పారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజంగా మారుద్దాం

నకరికల్లు: డ్రగ్స్ రహిత సమాజంగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు భాగస్వాములు కావాలని ఎస్ఐ కె.సతీష్ కోరారు. డ్రగ్స్ వద్దు బ్రో కార్యక్రమంలో భాగంగా స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ తీసుకుంటే శారీరక, మానసిక ఆరోగ్యంపై దుష్ప్రభావం పడుతుందన్నారు. డ్రగ్స్ లాంటి మాదకద్రవ్యాలకు, దుర్వ్యసనాలకు బానిసలైన వారు నేరాలకు పాల్పడి జీవితాలు చిన్నాభిన్నం చేసుకుంటున్నారన్నారు. యువత డ్రగ్స్ బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గంజాయి, నాటుసారా లాంటి అమ్మకాలు, నిల్వలు తెలిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు.



విద్యార్థులకు సూచనలు చేస్తున్న ఎస్ఐ సతీష్,

ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన సమాజ స్థాపనకు పాటుపడాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు డ్రగ్స్ వద్దు బ్రో అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జాలాది శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

'సోలార్'తో విద్యుత్ బిల్లుల ఆదా

నకరికల్లు: పీఎం సూర్యఘర్ పథకాన్ని ప్రతిఒక్కరూ వినియోగించుకుని విద్యుత్ బిల్లుల ఆదాను పొందాలని విద్యుత్ ఏఈ జి.సుచరిత సూచించారు. సోలార్ ప్రయోజనాలను వివరిస్తూ విద్యుత్‌శాఖ ఆధ్వర్యాన శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలి యోజనతో గృహాలకు సోలార్ ఏర్పాటుకు రాయితీ వర్తిస్తుందన్నారు. ఒక కిలో వాట్ సోలార్‌కు రూ.30 వేలు, రెండుకిలోవాట్ల సోలార్‌కు రూ.60 వేలు, 3కిలోవాట్ల సోలార్‌కు రూ.78 వేల రాయితీ వస్తుందన్నారు. గృహ అవసరాలకు సోలార్ సిస్టం ఏర్పాటుతో విద్యుత్‌బిల్లులు పూర్తిగా ఆదా అవుతాయన్నారు. విద్యుత్‌శాఖ సిబ్బందిని సంప్రదించి రాయితీతో కూడిన సోలార్ పొందాలని కోరారు. కార్యక్రమంలో ఎల్ఐ కె.శ్రీనివాసరావు, లైన్‌మెన్‌లు వై.జయబాబు, షేక్ షంషేర్, షేక్ రంజాన్‌షరీఫ్, రమేష్‌బాబు, ఎస్.వరప్రసాదరావు పాల్గొన్నారు.

క్రోసూరు: పీఎం సూర్యఘర్ ఉచిత విద్యుత్ పథకంలో చేరండి– పర్యావరణాన్ని కాపాడండి అంటూ శనివారం ఏపీసీపీడీసీఎల్ విద్యుత్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం క్రోసూరు నాలుగురోడ్ల సెంటర్ నుంచి గ్రామ శివారు వరకు అవగాహన ర్యాలీ చేశారు. డీఈఈ ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రధానమంత్రి ముఫ్త్ బిజిలీ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం సోలార్ ప్యానల్స్ ద్వారా ఉచితంగా విద్యుత్ పొందొచ్చన్నారు. కార్యక్రమంలో సంస్థ క్రోసూరు ఏఈ ఎం.బసవరాజు, అచ్చంపేట ఏఈ శ్రీనివాసరెడ్డి, సంస్థ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముప్పాళ్ళ: పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజనతో విద్యుత్ బిల్లు తగ్గించుకోవచ్చని విద్యుత్ శాఖ ఏఈ జి.సుచరిత తెలిపారు. మండల కేంద్రమైన ముప్పాళ్ళలో విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం పై శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి ముప్పాళ్ళ వరకు నినాదాలు చేస్తూ ర్యాలీ జరిగింది. కార్యక్రమంలో విద్యుత్ శాఖ సిబ్బంది శ్రీమన్నారాయణ, ఏఎల్ఎం ఖాన్, అనంత నాగరాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాజుపాలెం: సోలార్ సిస్టంను ఏర్పాటు చేసుకుంటే గృహ వినియోగదారులకు విద్యుత్ బిల్లులో గణనీయమైన తగ్గింపులు పొందవచ్చని విద్యుత్ ఏఈ పి.భాస్కర్ తెలిపారు. మండలకేంద్రంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో సోలార్ విద్యుత్ వినియోగంపై సిబ్బంది శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, లైన్‌మెన్‌లు అశోక్, కట్టా శ్రీనివాసరావు, పులిబండ్ల శ్రీనివాసరావు, రామునాయక్ తదితరులు పాల్గొన్నారు.



సోలార్‌పై అవగాహన ర్యాలీలో నకరికల్లు విద్యుత్‌శాఖ సిబ్బంది

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

మున్సిపల్ కమిషనర్ నంబూరి ఆనంద్‌కుమార్

సత్తెనపల్లి: పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యమని మున్సిపల్ కమిషనర్ నంబూరి ఆనందకుమార్ అన్నారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్రలో భాగంగా శనివారం పట్టణంలోని పార్క్ రోడ్డులో ఉన్న సుగాలి కాలనీ జెడ్పీ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ అంశంపై వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ప్రతి తరగతి నుంచి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను కలిపి మొత్తం 24 మంది విద్యార్థులను విజేతలుగా ప్రకటించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆనంద్ కుమార్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు చిన్నతనం నుంచే అవగాహన ఉండాలన్నారు. విద్యార్థులు కుటుంబ సభ్యులతో తడి చెత్త, పొడి చెత్త వేరు చేయించి మున్సిపల్ వాహనాలకు అందించేలా తల్లిదండ్రులకు అవగాహన కలిగించాలన్నారు. క్లీన్ ఎయిర్ కార్యక్రమంలో భాగంగా గార్లపాడు బస్టాండ్ వరకు సైకిల్ నడుపుతూ ర్యాలీ నిర్వహించి మానవహారం చేసి ప్రతిజ్ఞ చేయించారు. పర్యావరణ కాలుష్యాన్ని నివారించడానికి పాత మోటార్ వాహనాల వాడకాన్ని తగ్గించాలన్నారు. అనంతరం పోటీల్లో విజేతలను ప్రకటించారు. వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం.విజయసారథి, ప్రధానోపాధ్యాయులు ఇందిరా ప్రియదర్శిని, మాధవీలత, శానిటరీ సెక్రటరీలు, శానిటరీ మేస్త్రీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తది తరులు ఉన్నారు.



పట్టణంలో సైకిల్‌పై కమిషనర్ ఆనంద్‌కుమార్

లేమల్లెలో..

అమరావతి: లేమల్లె పంచాయతీ ఆధ్వర్యంలో మూడవ శనివారం స్వర్ణాంధ్ర -స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ ఉగ్గం పున్నమ్మ మాట్లాడుతూ ప్రజలందరు కూడా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమేష్, తదితర సిబ్బంది హెచ్ఎం నీలిమ పాల్గొన్నారు.

స్వచ్ఛతకు ప్రాధాన్యమివ్వాలి

నకరికల్లు: వాతావరణ కాలుష్యాన్ని అరికట్టడానికి ప్రతిఒక్కరూ నడుం బిగించాలని ఎంపీడీఓ జి.కాశయ్య సూచించారు. స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్రలో భాగంగా స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన జీవనం అంశంపై పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవుడికి ప్రాణాధారమైన గాలి కాలుష్యాన్ని నివారించాలన్నారు. నిషేధిత ప్లాస్టిక్ వాడకం అరికట్టాలన్నారు. వ్యర్థాలను నిర్దేశిత ప్రదేశాల్లోనే కాల్చాలన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ ఎంపీడీఓ కె.వి.శివప్రసాద్, ఏఓ కె.దేవదాసు, పంచాయతీరాజ్ ఏఈ కె.సురేష్, పంచాయతీ కార్యదర్శులు, గ్రీన్‌అంబాసిడర్‌లు పాల్గొన్నారు.



లేమల్లెలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ర్యాలీ

క్రోసూరు: స్వచ్ఛమైన గాలి ఉంటే ఆరోగ్యం బాగుంటుందని పీహెచ్‌సీ డాక్టర్ జాఫ్రీన్ అన్నారు. శనివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. ఈ నెల కాన్సెప్ట్ 'క్లీన్ ఎయిర్ -శుభ్రమైన గాలి' అనే అంశంపై వైద్యాధికారిని జాఫ్రీన్ మాట్లాడుతూ గాలి కాలుష్యం తగ్గితే ప్రజల ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. చెట్ల పెంపుతో ఆక్సిజన్ స్థాయి పెరుగుతుందని పేర్కొన్నారు. ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్ మాట్లాడుతూ గాలి మన జీవనాధారమని వాహనాలు, పరిశ్రమలతో గాలి కలుషితమవుతుందన్నారు. స్వచ్ఛ గాలి –'ఆరోగ్య ఆంధ్ర'అనే ధ్యేయంతో ప్రతి కుటుంబం చెట్లు నాటాలని, ప్రతి పౌరుడు వాహన వాడకాన్ని తగ్గించాలని, ప్రతి విద్యార్థి ఒక వృక్షాన్ని సంరక్షించాలని ఆయన పేర్కొన్నారు.

సీనియర్ సిటిజన్లూ.. సైబర్ నేరాలపై అప్రమత్తం

సత్తెనపల్లి: సైబర్ నేరాలపై సీనియర్ సిటిజన్లు అప్రమత్తంగా ఉండాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సత్తెనపల్లి మెయిన్ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ సాంబశివరావు అన్నారు. పట్టణంలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన పెన్షనర్స్ ఫిర్యాదుల పరిష్కార సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సదస్సుకు అసోసియేషన్ అధ్యక్షుడు జక్కుల లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ ఇటీవల కాలంలో సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని, సీనియర్ సిటిజన్లు జాగ్రత్త వహించాలన్నారు.

ఈ సందర్భంగా వారికి పలు సూచనలు చేశారు. సీనియర్ సిటిజన్లకు బ్యాంకులో ప్రత్యేక సదుపాయాలు కలగజేస్తానని, వారు ఎప్పుడైనా బ్రాంచ్‌ను సంప్రదించవచ్చన్నారు. ముందుగా పెన్షనర్స్ ఫిర్యాదులను విని వాటి పరిష్కార మార్గాలను తెలిపారు. సీనియర్ సిటిజన్లు సుందర్‌సింగ్, సుబ్బారావు, వెంకట్రావు, కేబీఆర్జే ప్రసాద్, జగన్నాథ నాయుడు, మోహిద్దిన్, నాగేశ్వరరావు, చంద్రయ్య, పొత్తూరి రామకోటయ్య, నాగవర్ధన్, రామకృష్ణమా చార్యులు కొన్ని సందేహాలను వ్యక్తపరచగా వాటిని ఆయన నివృత్తి చేశారు.



సదస్సులో మాట్లాడుతున్న ఎస్బీఐ చీఫ్ మేనేజర్ సాంబశివరావు

కేతవరం ఆలయం రహదారి పరిశీలన

బెల్లంకొండ: కేతవరం వజ్ర లక్ష్మీనరసింహస్వామి ఆలయ రహదారిని శనివారం అటవీశాఖ అధికారులు పరిశీలించారు. పులిచింతల ప్రాజెక్టు ముంపు గ్రామమైన కేతవరంలో ఉన్న ఆలయం మునగడంతో కొన్నేళ్ల క్రితం సమీపంలో ఉన్న కొండపై నూతన ఆలయాన్ని నిర్మించారు. ఆలయానికి వెళ్లేందుకు ఎమ్మాజీ గూడెం నుంచి రహదారిని ఏర్పాటు చేశారు. దాదాపుగా 14 కిలోమీటర్ల మేర అటవీ ప్రాంతం మీదుగా ఈ రహదారి ఉండడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. కంపచెట్లు పెరిగి, గుంతలు పడటంతో భక్తులు ఆలయానికి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. కార్తిక మాసం దృష్ట్యా రహదారికి మరమ్మతులు చేయాలంటూ ఆలయ కమిటీ సభ్యులు స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన ఆదేశాల మేరకు శనివారం ఫారెస్ట్ రేంజ్ అధికారి విజయకుమారి సిబ్బందితో కలిసి రహదారిని పరిశీలించారు. కార్యక్రమంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు కాశిం, సాంబయ్య, ఆలయ కమిటీ చైర్మన్ పాశం నరసింహారెడ్డి పాల్గొన్నారు.



కేతవరం ఆలయం వద్ద రహదారిని పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు

ఆటోలో రూ. 16 వేలు విలువచేసే సిగరెట్ల బాక్స్ మాయం

సత్తెనపల్లి: ఆటోలో రూ. 16 వేలు విలువచేసే సిగరెట్ల బాక్స్ మాయమైన ఘటన శనివారం పట్టణంలోని గడియార స్తంభం సెంటర్‌లో వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. మేడికొండూరు మండలం సిరిపురం గ్రామానికి చెందిన వ్యాపారి చౌట లక్ష్మీనారాయణ పట్టణంలోని గార్లపాడు బస్టాండ్ సెంటర్‌లో శనివారం సిగరెట్లు కొనుగోలు చేశాడు. రూ. 16 వేలు విలువచేసే సిగరెట్లు తీసుకొని తాలూకా సెంటర్‌కు వెళ్లే క్రమంలో గడియార స్తంభం వద్ద ఆటో ఎక్కి వెనుకభాగంలో పెట్టి ముందు సీట్లో కూర్చున్నాడు. తాలూకా సెంటర్ వద్ద దిగి చూడగా సిగరెట్ బాక్స్ మాయం కావడంతో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సీసీ టీవీ పుటేజీలను పరిశీలన చేస్తున్నారు.

'భవన' కార్మికుల వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించండి

సత్తెనపల్లి: భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించి సంక్షేమ పథకాలను అమలు చేయాలని పల్నాడు జిల్లా భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు అవ్వారు ప్రసాదరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు భవన నిర్మాణ కార్మికులతో కోటి సంతకాలు సేకరించి సీఎం చంద్రబాబుకు పంపేందుకు శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని శనివారం పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని గార్లపాడు బస్టాండ్ సెంటర్‌లో ఆయన ప్రారంభించారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరంన్నర దాటుతున్నా భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో పల్నాడు భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షుడు కె.ఆంజనేయులు, పట్టణ కార్యదర్శి జి సాల్మన్‌రాజు, భవన నిర్మాణ కార్మికులు గొట్టం ఏడుకొండలు, పసుపులేటి చిన్నాస్వామి, పుట్ట నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



సత్తెనపల్లిలో కోటి సంతకాల సేకరణ ప్రారంభించి మాట్లాడుతున్న అవ్వారు ప్రసాదరావు

లక్ష్మీనారాయణ మృతి కళారంగానికి తీరని లోటు

సత్తెనపల్లి: రంగస్థల నటుడు జన్నాభట్ల లక్ష్మీనారాయణ మృతి కళా రంగానికి తీరని లోటును మిగిల్చిందని పలు కళాసంస్థల బాధ్యులు అన్నారు. పల్నాడు జిల్లా నూజెండ్లకు చెందిన రంగస్థల కళాకారుడు లక్ష్మీనారాయణ మోటార్ సైకిల్ ప్రమాదానికి గురై నరసరావుపేటలో ఈ నెల 17న మృతి చెందడంతో శనివారం సత్తెనపల్లిలో సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా వివిధ కళా సంస్థల బాధ్యులు మాట్లాడుతూ గత 36 సంవత్సరాలుగా అనేక విద్యాసంస్థల్లో సంస్కృత ఆంధ్ర ఉపన్యాసకులుగా లక్ష్మీనారాయణ విశిష్ట సేవలు అందించారన్నారు. నాగార్జున యూనివర్సిటీ సెనెట్ మెంబర్‌గా పని చేశారని, రంగస్థల నటుడిగా గొప్ప పేరు పొందారన్నారు. లక్ష్మీనారాయణ ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ ఎన్వీ చలపతి రావు, ఫ్రెండ్స్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు మారూరి పుల్లారెడ్డి, ప్రజానాట్యమండలి సత్తెనపల్లి శాఖ బాధ్యుడు అమర్‌నాథ్, చైతన్య కళా స్రవంతి అధ్యక్షుడు లయన్ కమతం శ్రీనివాసరావు, టీడీపీ సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు గుర్రం వెంకటేశ్వర్లు, ప్రగతి కళా మండలి బాధ్యుడు నూతలపాటి సాంబయ్య, ఆకివీడు సరిగమ కళాపరిషత్ అధ్యక్షుడు ఎస్ కోటేశ్వరరావు, ఉషోదయ కళాపరిషత్ అధ్యక్షుడు పిన్నమనేని పాములయ్య, చత్రపతి కళాపరిషత్ అధ్యక్షుడు పులహరి బానోజీ, ఘంటసాల కళానిలయం అధ్యక్షుడు బుడగల సుబ్బారావు, పట్టణ కళాకారులు, తదితరులు ఉన్నారు.

22న సొలసలో డివిజన్‌స్థాయి వాలీబాల్ పోటీలు

యడ్లపాడు: సొలసలో ఈనెల 22న జెడ్పీ హైస్కూలులో నరసరావుపేట డివిజన్ స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు హెచ్ఎం వెంకటేశ్వరరావు శనివారం పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతాయని తెలిపారు.